సాక్షి
నంద్యాల
శనివారం। 5। అక్టోబర్। 2024



ధనలక్ష్మిగా మంచాలమ్మ

మంత్రాలయం: గ్రామ దేవత మంచాలమ్మ ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మ వారిని కరెన్సీతో విశేషంగా అలంకరించారు.



జీడీపీలోకి వరద నీరు

గోనెగండ్ల: రెండురోజులుగా కురుసున్న వానకు గాజులదిన్నె ప్రాజెక్ట్‌లోకి శుక్రవారం 600క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 2 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



సున్నిపెంటకు జ్వరమొచ్చింది!

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట విష జ్వరాలతో మంచం పట్టింది. ఇక్కడ పది రోజులుగా జ్వర పీడితులు పెరుగుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. 6లో▸

న్యూస్‌రీల్

రెండవ రోజు టెట్‌కు 81 మంది గైర్హాజర్

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో రెండో రోజు శుక్రవారం జరిగిన టెట్‌కు 81 మంది గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాల్లో పేపర్ –2ఏ తెలుగు, ఇంగ్లిష్ పరీక్షలు జరిగాయన్నారు. రాజీవ్‌గాంధీ ఇంజినీరింగ్ కాలేజీలో ఉదయం సెషన్‌కు 160 మందికి గాను 142 మంది హాజరు కాగా 18 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం సెషన్‌కు 60 మందికి గాను 54 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఉదయం సెషన్‌కు 175 మందికి గాను 151 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు 175 మందికి గాను 142 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరైనట్లు డీఈఓ తెలిపారు.

మహానందీశ్వర దంపతులకు వెండి కిరీటాలు



వెండి కిరీటాలు అందిస్తున్న దాతలు

మహానంది: మహానందిలో వెలసిన శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారి కల్యాణోత్సవానికి అవసరమైన వెండి కిరీటాలు, హస్తాలను ఓ భక్తుడు విరాళంగా అందించారు. నంద్యాలకు చెందిన వెన్నుపూస ఈశ్వర్‌రెడ్డి, సంజమ్మ దంపతుల కుమారుడు శివ పవన్‌కుమార్ రెడ్డి శుక్రవారం రూ.లక్ష విలువైన మూడు వెండి కిరీటాలు, నాలుగు అభయ వరద హస్తాలను ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అందించారు.

కుంగిన కేసీ కెనాల్ గట్టు



దెబ్బతిన్న కేసీ కాలువ గట్టు

పగిడ్యాల: మండల కేంద్రమైన పగిడ్యాల నేల గండి వాగు సమీపంలో కేసీ కెనాల్ కాలువ గట్టు కుంగిపోయింది. కేసీ కాలువ పూర్తి స్థాయి నీటి ప్రవాహంతో ప్రవహిస్తుండటంతో కుంగిన ప్రాంతంలో గండి పడే ప్రమాదం నెలకొంది. దీంతో నల్లవాగు పరీవాహక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న నూర్పిడి పనులు ముమ్మరంగా ఉన్నందున ట్రాక్టర్లు, కోత మిషన్ల రాకపోకలు పెరిగాయి. దీంతో కాలువ గట్టు మరింత దెబ్బతిని కుంగినట్లు తెలుస్తోంది. నీటిపారుదల శాఖ అధికారులు తక్షణమే స్పందించి కేసీ గట్టును పటిష్టం చేయాలని రైతులు కోరుతున్నారు.

సీఎం సహాయ నిధికి పొదుపు మహిళల విరాళం

నంద్యాల(న్యూటౌన్): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు జిల్లాలోని పొదుపు లక్ష్మి గ్రూపు మహిళలు ముందుకొచ్చారు. జిల్లాలోని పొదుపు గ్రూపు మహిళలందరూ తమ వంతు వితరణగా రూ.50 లక్షల మొత్తాన్ని జమ చేశారు. మొదటి దఫా రూ. 20 లక్షల చెక్కును ఇటీవల శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా చేతుల మీదుగా సీఎం సహాయనిధికి అందజేశారు. శుక్రవారం స్వర్ణాంధ్ర – 2047 కార్యక్రమంలో రూ.30 లక్షల చెక్కును కలెక్టర్ రాజకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పొదుపు మహిళలను అభినందించారు.

శ్రీశైలంలో 199 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 198.8120 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 882 అడుగులకు చేరుకుంది. డ్యాం పరిసర ప్రాంతాల్లో 15.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలంకు గురువారం నుంచి శుక్రవారం వరకు 78,006 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 51,801 క్యూసెక్కులను వదిలారు. కుడిగట్టు కేంద్రంలో 1.381 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.126 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

నేడు రైతుల ఖాతాలకు పీఎం కిసాన్ నిధులు

కర్నూలు(అగ్రికల్చర్): పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి కేంద్రం రైతులకు 18వ విడత ఆర్థిక సహాయం చెల్లించేందుకు రంగం సిద్ధం చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ నెల 5న మహారాష్ట్రలో జరిగే కార్యక్రమంలో బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము విడుదల చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం 2024 జూన్ 18న 17వ విడత పీఎం కిసాన్ సాయం విడుదలైంది. నరేంద్రమోడీ 3వ సారి ప్రధానమంత్రి అయ్యాక రెండోసారి పీఎం కిసాన్ సాయం రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేయనున్నారు.

కల్తీ రాజకీయం.. సిట్‌రైట్!



ఏడుకొండల స్వామిని రాజకీయాల్లోకి లాగారు. ఓ వర్గం మద్దతు కూడగట్టుకొని ప్రత్యర్థి పార్టీపై విషం చిమ్మాలనుకున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు ప్రభుత్వానికి మొట్టికాయ వేసింది. ఏ ఆధారాలు లేకుండా కల్తీ జరిగినట్లు ముఖ్యమంత్రి మాట్లాడటం ఏంటని గతంలో సూటిగా ప్రశ్నించిన సుప్రీంకోర్టు, తాజాగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సిట్'ను తిరస్కరించింది. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఐదుగురు సభ్యులతో సిట్ ఏర్పాటు చేసింది. తద్వారా స్వామితో రాజకీయాలు వద్దని, స్వతంత్ర దర్యాప్తుతోనే నిజాలు నిగ్గు తేలుతాయని చెప్పకనే చెప్పింది. ఇకనైనా స్వామితో రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీతో పాటు ఆధ్యాత్మిక వేత్తలు హితవు పలుకుతున్నారు.



ప్రభుత్వ సిట్‌ను వ్యతిరేకించిన సుప్రీంకోర్టు

- సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో ప్రత్యేక సిట్
- తిరుమల లడ్డూపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం
- ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు తగవని కోర్టు మొట్టికాయ
- ఇకనైనా దుష్ప్రచారం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ హితవు
- టీడీపీ తీరును తప్పుపడుతున్న ఆధ్యాత్మికవేత్తలు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: తిరుపతి లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందనే తప్పుడు ప్రచారం రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. టెండర్ దక్కించుకున్న కొత్త కాంట్రాక్టర్ ఏఆర్ డెయిరీ తొలి నెయ్యి ట్యాంకర్‌ను సరఫరా చేసింది జూన్ 12 టీడీపీ ప్రభుత్వ హయాంలోనే. మొదట 6 ట్యాంకర్ల నెయ్యిని ల్యాబ్‌లో పరీక్షించి, ఆ తర్వాతనే లడ్డూ తయారీ పోటులోకి పంపారు. అనంతరం 2 ట్యాంకర్ల నెయ్యి పరీక్షల్లో క్వాలిటీ లేదని తేలడంతో తిరస్కరించారు. ఈ వ్యవహారం జరిగింది టీడీపీ ప్రభుత్వ హయాంలోనే. క్వాలిటీ ఉన్న నెయ్యిని అనుమతించారు.. క్వాలిటీ లేని నెయ్యిని తిరస్కరించారు. దీన్ని బట్టి చూస్తే కల్తీ నెయ్యి లడ్డూ తయారీకి వాడలేదనేది స్పష్టమవుతోంది. కాంట్రాక్టర్‌ను గత ప్రభుత్వంలో నియమించినా, అతను నెయ్యి సరఫరా చేయడం ప్రారంభించింది జూన్ 12 నుంచి మాత్రమే. ఈ వ్యవహారం మొత్తం టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగినా, గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లు కూటమి ప్రభుత్వం ప్రచారం చేసింది. ఈ ప్రచారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్ 'స్టార్ క్యాంపెయినర్లు'గా మారారు. తమకు అనుకూలంగా ఉన్న మీడియాలో ఏకపక్షంగా దుష్ప్రచారం చేయించారు. సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు మొత్తం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా విమర్శలు చేశారు. దీన్నిబట్టి ఈ వ్యవహారాన్ని పూర్తి రాజకీయంగా వాడుకుంటున్నారని అందరికీ స్పష్టమైంది.

రాష్ట్రానికి పాపం జరగకూడదని పూజలు



లడ్డూ వ్యవహారాన్ని రాజకీయం చేయడంతో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నేతలు కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా 14 నియోజకవర్గాల్లోని మండలాలు, పల్లెల్లో చాలా చోట్ల వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. తప్పు ఎవరు చేస్తే వారిని శిక్షించాలని, జరగని అపచారం జరిగినట్లు ప్రభుత్వం ప్రచారం చేసిన పాపం రాష్ట్రానికి తగలకూడదని ప్రార్థించారు. కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి వెంకటరమణ కాలనీలో, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి కృష్ణానగర్‌లోని శ్రీనివాస ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు ప్రజలు కూడా పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు నైతిక విజయమంటున్న వైఎస్సార్‌సీపీ

లడ్డూ వ్యవహారంపై సీబీఐతో విచారణ చేయించాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో పాటు తమిళనాడు మాజీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి కోర్టును ఆశ్రయించారు. సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కర్నూలు వాసి, విశ్వహిందూపరిషత్ దక్షిణాంధ్ర అధ్యక్షుడు నంది రెడ్డి సాయిరెడ్డి డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వం మాత్రం తమకు అనుకూలమైన రాష్ట్ర పోలీసులతో 'సిట్' ఏర్పాటు చేసింది. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. టీడీపీ ఆఫీసులో తయారైన రిపోర్ట్‌పై సిట్ అధికారులు సంతకాలు చేస్తారని పలువురు ఆరోపించారు. ఈక్రమంలో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సిట్'ను రద్దు చేస్తూ సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో 'సిట్' ఏర్పాటు చేసింది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సుప్రీం నిర్ణయంతో న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని అన్ని వర్గాలు వ్యక్తం చేశాయి. మొత్తం వ్యవహారంలో తమను రాజకీయంగా నష్టపరచాలని ప్రభుత్వం భావించినా, సుప్రీం తీర్పుతో నైతిక విజయం దక్కిందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.

దుష్ప్రచారం మానుకోవాలి



పాలకులు సర్వోత్తమ న్యాయస్థానానికి విలువనిచ్చి ఇకనైనా దుష్ప్రచారం మానుకోవాలి. లడ్డూలో కల్తీ జరిగినట్లు ఎక్కడా ఆధారాలు లేవు. గతంలో లడ్డూ నాణ్యతలో స్వల్పంగా మార్పు వచ్చిందనే విషయం అందరికీ తెలిసిందే. కానీ అందులో జంతువుల కొవ్వు వాడినట్లు అవాస్తవాలు సృష్టించడం మంచిది కాదు.

– ఫణీంద్రనాథ్‌శర్మ, సీనియర్ న్యాయవాది, నంద్యాల

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను రద్దు చేసి సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నాం. సీబీఐతో లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని మొదటి నుంచి మేం డిమాండ్ చేస్తున్నాం. స్వామిని రాజకీయాలకు వాడుకోవడం దౌర్భాగ్యం. రాజకీయాలు భ్రష్టు పట్టాయి అనిపిస్తోంది. ఏడుకొండల వాడు ప్రత్యక్ష దైవం. ఎవరైతే దోషులు ఉన్నారో వారిని ఆయనే శిక్షిస్తారు.

– నందిరెడ్డి సాయిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర అధ్యక్షుడు

వైఎస్సార్‌సీపీకి దేవుడే నైతిక విజయాన్ని అందించారు



రాజకీయంగా లబ్ధి పొంది వైఎస్సార్‌సీపీపై మతం అనే విషం చల్లాలని చంద్రబాబు చూశాడు. సాక్షాత్తూ ఏడుకొండల స్వామిని రాజకీయంగా వాడుకున్నారు. ఇప్పుడు సుప్రీం తీర్పుతో బాబు నిజస్వరూపం బట్టబయలైంది. ఇప్పటి వరకూ చేసిన తప్పుడు ప్రచారాన్ని సిట్‌తో మరింతగా చేస్తారని సుప్రీం భావించినట్లుంది. అందుకే రద్దు చేసి సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీపై విషం చిమ్మాలని చంద్రబాబు భావించినా, ఏ తప్పు చేయని మా పార్టీకి వెంకటేశ్వరస్వామే నైతిక విజయంతో ఆశీర్వదించారు.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు

సీబీఐకి అప్పగించడం శుభ పరిణామం



లడ్డూ కల్తీ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగించడం శుభ పరిణామం. తిరుమల ఎంతో పవిత్ర పుణ్యక్షేత్రం, లడ్డూను అంతకంటే పవిత్రంగా భక్తులు భావిస్తారు. చాలా మంది స్వామిని చూడలేకపోయినా ప్రపంచ వ్యాప్తంగా భక్తులు లడ్డూ రుచి చూసి మంత్రముగ్ధులవుతుంటారు. అలాంటి సున్నితమైన విషయాన్ని ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు ఎలాంటి ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేయడం విచారకరం.

–ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్, కర్నూలు

బాబూ.. ఇసుక ఎక్కడ!

- ఇది ప్రజలను ముంచే ప్రభుత్వం
- బాబు పాలనపై సీపీఎం నాయకుల ఆగ్రహం



ఇసుకను అందుబాటులోకి తేవాలని ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఉచిత ఇసుక అందజేస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు వెంటనే ఇసుకను అందుబాటులోకి తేవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి ఫుల్లా నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఇది మంచి ప్రభుత్వం కాదు.. ప్రజలను ముంచే ప్రభుత్వమన్నారు. లారీ ఇసుక గతంలో రూ.20 వేలు ఉండగా ప్రస్తుతం రూ.35 వేలకు కొందామన్నా.. అందుబాటులో ఇసుక లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 108 ఇసుక రీచ్‌లు ఉన్నాయని, అయితే ఎక్కడా కూడా ఏ ఇసుక రీచ్‌లో ప్రజలకు ఇసుక అందుబాటులో లేదన్నారు. తక్షణమే నంద్యాల పట్టణంలో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఎం సీనియర్ నాయకులు తోట మద్దులు, ఎండీ గౌస్, లక్ష్మణ్, వెంకటలింగం, సీఐటీయూ జిల్లా నాయకులు బాలవెంకటేష్, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు జైలాన్,, శివ, మహిళా సంఘం నాయకురాలు భాను,విజయ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో అక్రమాలను అడ్డుకోండి

- 600 టన్నుల ఇసుక మాయంపై విచారణ చేయాలి
- అటవీ భూములు ఆక్రమించేస్తున్నారు
- కలెక్టర్‌ను కోరిన మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత భూమా కిశోర్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): ఆళ్లగడ్డ నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ ఇసుక దందా, ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ మైనింగ్, దోపిడీలు, దౌర్జన్యాలను అడ్డుకోవాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి జిల్లా కలెక్టర్ రాజకుమారిని కోరారు. టీడీపీ నేతలు ఆగడాలకు అడ్డుకట్ట వేసి నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా కిశోర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గజ్జల రాఘవేంద్రారెడ్డి, రాఘవరెడ్డి, బాబులాల్ తదితరులతో కలసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 22వ తేదీన ఆళ్లగడ్డలో స్టాక్ పాయింట్‌లో 600 టన్నుల ఇసుక మాయమైనా ఇంత వరకు కేసు నమోదు కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆళ్లగడ్డలో అక్రమ మైనింగ్ వ్యాపారం యథేచ్ఛగా సాగుతుందన్నారు. లింగందిన్నె వద్ద టిప్పర్లతో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపడుతూ, అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. భవిష్యత్తు అవసరాలకు నవ అహోబిలం కోసం రిజర్వ్ ఫారెస్ట్ మధ్యలో 100 ఎకరాల రెవెన్యూ ల్యాండ్‌ను అప్పట్లో కేటాయించారని, ప్రస్తుతం ఆ భూములను కొందరు ఆక్రమించుకుంటూ పట్టాలు చేసుకుంటున్నారన్నారు. చిరుద్యోగులు, రైతులు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు సంబంధించి ఆన్‌లైన్‌లో పేర్లు మార్పు చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారన్నారు. మున్సిపాలిటీ గేట్ల వసూళ్ల పెంచడం అన్యాయమని, ఎరువుల కోసం వచ్చే రైతుల నుంచి ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారన్నారు. ఇటీవల గ్రామ పంచాయతీలకు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన బిల్లులు పెట్టకుండా సర్పంచ్‌లను తిప్పుకోవడం అన్యాయమన్నారు. భూమా కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ ఆళ్లగడ్డలో ప్రజలు దోపిడీకి గురవుతున్నారన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.10 వేలు వసూలు చేస్తున్నారని, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

యాగంటీశ్వరుడి సాక్షిగా..



టెంకాయల విక్రయానికి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు



పురావస్తు శాఖ అధికారులు సేవా టికెట్ల విక్రయ కేంద్రానికి తాళం వేసిన దృశ్యం

- టెంకాయల షెడ్డు ఏర్పాటు చేసిన దేవదాయ శాఖ
- అనుమతి లేదని పురావస్తు శాఖ అధికారుల ఆగ్రహం
- సేవా టికెట్ల విక్రయ కేంద్రానికి తాళం

బనగానపల్లె రూరల్: ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి క్షేత్రంలో దేవదాయశాఖ, పురావస్తుశాఖ అధికారుల మధ్య అంతర్యుద్ధం నడుస్తోంది. క్షేత్రాభివృద్ధికి దేవదాయ శాఖ చర్యలు చేపడుతుండగా, కొత్త నిర్మాణాలకు అనుమతి లేదంటూ పురావస్తు శాఖ తేల్చి చెబుతోంది. ఈ క్రమంలో టెంకాయల విక్రయానికి అవసరమైన షెడ్ ఏర్పాటుపై కొన్ని రోజులుగా రెండు శాఖల మధ్య చర్చలు నడుస్తున్నాయి. అయితే గురువారం రాత్రి రేకుల షెడ్‌ను తీసుకువచ్చి ఆలయ ఆవరణలో వేశారు. శుక్రవారం ఉదయం అక్కడ విధుల్లో ఉన్న పురావస్తుశాఖ అధికారి అశ్వినీకుమార్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు క్షేత్ర పరిధిలోని సేవా టికెట్ల విక్రయ కేంద్రానికి తాళం వేశారు. పురావస్తుశాఖ నిబంధనల ప్రకారం స్వామి దర్శనానికి భక్తుల నుంచి ఎలాంటి ప్రవేశ రుసుం వసూలు చేయరాదని, షెడ్లు కూడా ఏర్పాటు చేయకూడదన్నారు. దీంతో సేవా టికెట్ల విక్రయ కేంద్రానికి తాళం వేసినట్లు ఆయన తెలిపారు. దర్శనానికి టికెట్లు లేకపోవడంతో పర్యాటకులు, భక్తులకు ఉచిత దర్శనం కల్పించాల్సి వచ్చింది. ఈ విషయంపై ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్‌ను వివరణ కోరగా సమస్య పరిష్కారమైందన్నారు.

శ్రీశైల భ్రామరీ.. నమోస్తుతే!

- మయూర వాహన సేవలో ఆది దంపతుల విహారం
- శ్రీశైలంలో దేదీప్యమానంగా సాగుతున్న దేవీశరన్నవరాత్రులు
- స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పులకించిన భక్తజనం



స్వామి అమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ చేయిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీగిరి క్షేత్రంలో దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం శ్రీశైల భ్రామరీ బ్రహ్మచారిణి స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కుమారీపూజ, సుహాసిని పూజ తదితర విశేష కార్యక్రమాలను నిర్విఘ్నంగా సాగిస్తున్నారు. శ్రీశైల భ్రమరాంబాదేవిని బ్రహ్మచారిణి స్వరూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. బ్రహ్మచారిణి అలంకారంలోని ఉత్సవమూర్తిని ఆలయం ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కొలువుంచారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజా హారతులనిచ్చారు. భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిఅమ్మవారలు మయూర వాహనంపై విహరించి భక్తులకు ఆశీస్సులు అందించారు. మయూర వాహనంపై ప్రత్యేకంగా అలంకరించిన స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను అలంకార మండపంలో అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మచారిణి స్వరూపంలోని అమ్మవారిని, మయూర వాహనంపై అధిష్ఠించిన స్వామిఅమ్మవార్లను ఆలయ రాజగోపురం మీదుగా వెలుపలకి తోడ్కొనివచ్చి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వామిఅమ్మవార్లను కన్నులారా భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించుకుని నీరాజనాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం శ్రీశైల క్షేత్రంలో చంద్రఘంట అలంకారంలో అమ్మవారు, రావణ వాహనసేవపై స్వామిఅమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు.



ఆలయ ఆవరణలో కుమారి పూజ నిర్వహించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు కౌతాళం మండలం మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. ఉరుములు, మెరుపుల తీవ్రత కూడా ఎక్కువగా ఉంది. అత్యధికంగా కృష్ణగిరిలో 48.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆలూరులో 25.6, కల్లూరులో 24.8, ఓర్వకల్‌లో 22.4, వెల్దుర్తిలో 20.4, ఆస్పరిలో 19.6, దేవనకొండలో 17.8, పత్తికొండలో 17.4, ఆదోనిలో 15.8, గూడూరులో 15.2 మి.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా సగటున 12.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. అక్టోబరు నెల సాధారణ వర్షపాతం 110.2 మి.మీ ఉండగా, మొదటి 4 రోజుల్లో 16.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

నంద్యాల జిల్లాలో ..

నంద్యాల(అర్బన్): జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా బేతంచెర్ల మండలంలో 48.2 మి.మీ, కొత్తపల్లి మండలంలో అత్యల్పంగా 0.6 మి.మీ వర్షం కురిసింది. మండల కేంద్రం అవుకులో ఓ మసీదు మినార్‌పై పిడుగు పడటంతో ధ్వంసమైంది. గోస్పాడు మండలంలో 37.4 మి.మీ, బనగానపల్లె 35.8, కొలిమిగుండ్ల 35.2, ప్యాపిలి 30.0, మిడుతూరు 26.4, డోన్ 25.8, నందికొట్కూరు 22.0, శిరివెళ్ల 21.0, శ్రీశైలం 20.4, కోవెలకుంట్ల 19.6, సంజామల 18.2, చాగలమర్రి 17.6, రుద్రవరం 15.4, ఆళ్లగడ్డ 13.2, ఆత్మకూరు 12.4, అవుకు, దొర్నిపాడు 12.2, నంద్యాల 9.4, ఉయ్యాలవాడ 9.0, జూపాడుబంగ్లా 4.2, గడివేముల 2.0, పాణ్యం 1.8, పగిద్యాలలో 1.4 మి.మీ వర్షం కురిసింది.

వేదావతికి వరద నీరు

హొళగుంద: ఆంధ్రా–కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి వద్ద ప్రవహిస్తున్న వేదావతి (హగరి) నదికి వరద ప్రవాహం మొదలైంది. కొద్ది రోజులుగా నది పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరద నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతుండటంతో నది తీర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నదికి ఇరువైపులా సాగు చేసుకున్న చెరుకు, వరి, పత్తి, మిరప తదితర పంటలకు ఈ సారి నీటి సమస్య ఉండదని రైతులు చెబుతున్నారు.

నేడు ఆదోని మార్కెట్ యార్డుకు సెలవు

ఆదోని అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్‌యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నేడు ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవన్నారు. తుఫాను ప్రభావం వల్ల ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. శుక్రవారం కురిసిన వర్షానికి మార్కెట్‌కు తెచ్చిన వివిధ పంట దిగుబడులు తడిచిపోయాయని తెలిపారు.

తగ్గిన పత్తి ధర

ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు శుక్రవారం పత్తి 11,473 క్వింటాళ్లు రాగా గరిష్ట ధర రూ.7,515, మధ్య ధర రూ.7,360, కనిష్ట ధర రూ.4,216గా నమోదైంది. అదేవిధంగా 10, 834 సంచులు వేరుశనగకాయలు రాగా గరిష్ట ధర రూ.7,256, మధ్య ధర రూ.6,479, కనిష్ట ధర రూ.3,290గా పలికింది.కాగా గత వారంలో పత్తికి రూ.7,800 వరకు ధర ఉండేది. ఇప్పుడు దాదాపు రూ. 300 వరకు తగ్గింది.

మరో నాలుగు ఇసుక రీచ్‌లు

కర్నూలు న్యూసిటీ : జిల్లాలో మరో నాలుగు ఇసు క రీచ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గనులు, భూగర్భ ఖనిజాల శాఖ ఉప సంచాలకులు వి. రవిచంద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇసుక డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కౌతాళం మండలం నదిచాగి, మరళి 1, 2,తో పాటు గుడికంబాలి రీచ్‌లను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో ఐదు ఇసుక రీచ్‌ల నుంచి కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాలకు ఇసుక సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 70 వేల టన్నుల ఇసుక ఆన్‌లైన్‌లో బుక్ కాగా అందులో 66 టన్నుల ఇసుక సరఫరా చేసినట్లు తెలిపారు. పట్టా ల్యాండ్ భూముల్లో ఇసుక మేటలు ఉంటే తరలించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు.

రూట్ మార్చుతున్న రియల్టర్లు!



- మద్యం వ్యాపారం వైపు చూపు
- రాజకీయ నాయకులతో తెర వెనుక మంత్రాంగం
- సిండికేట్లతో చేతులు కలిపి పెట్టుబడికి ప్రయత్నాలు

ఉమ్మడి జిల్లాలో ఇలా...

	కర్నూలు	నంద్యాల	మొత్తం
మద్యం దుకాణాలు	99	105	204
బార్ అండ్ రెస్టారెంట్లు	27	22	49
ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లు	7	7	14

కర్నూలు: జిల్లాలో కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతినింది. దీంతో ఈ రంగంలో ఉన్న వారిలో కొందరికి మద్యం వ్యాపారంపై దృష్టి పడింది. వ్యక్తిగతంగా దరఖాస్తులు చేస్తే డబ్బులు దక్కవన్న భయంతో సిండికేట్‌లో కలిస్తే ఫలితం ఉంటుందని నంద్యాల, కర్నూలు, ఆదోని పట్టణాల్లో కొందరు చర్చలు జరుపుతున్నట్లు వినికిడి. కర్నూలుకు చెందిన కొందరు ఉద్యోగ విరమణ తర్వాత రియల్ వ్యాపారంలో బాగా సంపాదించారు. మద్యం వ్యాపారులతో వారికి గతం నుంచే మంచి సంబంధాలున్నాయి. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ అమలులో భాగంగా ఈనెల 12 నుంచి కొత్త దుకాణాలను ఏర్పాటు చేయనుండటంతో వారు కూడా ఈ వ్యాపారంలో అడుగు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. రాజకీయ నాయకుల అండదండలు ఉండకపోతే రూ.లక్షలు మద్యంలో ధారపోసినట్లేనని తటపటాయిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. అయితే, సిండికేట్‌లో ఉన్న కొందరు వ్యాపారులతో సంప్రదింపులు జరిపి ఆ దిశగా పావులు కదుపుతున్నారు. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసే వ్యక్తి చిరునామా ప్రకారం ఏ స్టేషన్ పరిధిలో ఉంటే ఆ స్టేషన్ పరిధిలో దరఖాస్తు సమర్పించాలి. ఆశావహులు నియోజకవర్గాల్లో అధికార పార్టీ నాయకులతో తెర వెనుక ఈ మేరకు మంత్రాంగాలు జరుపుతున్నారు.

వ్యాపారంపై అంచనాతో...

మద్యం దుకాణం అనుమతి దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. దరఖాస్తు రుసుం పెద్ద మొత్తం కావడంతో పాత వ్యాపారులు అన్ని విధాలుగా ఆలోచిస్తున్నారు. మద్యం అమ్మకాలు ఎక్కడ ఎక్కువగా జరుగుతాయోనని ప్రస్తుతమున్న ప్రభుత్వ దుకాణాల్లో వివరాలు సేకరించి ముగ్గురు, నలుగురితో కలసి భాగస్వామ్య ఒప్పందంతో దరఖాస్తులు చేస్తున్నారు. రోజూవారీ వ్యాపారం, లావాదేవీలు తదితర అంశాలపై అంచనాకు వచ్చి ముఖ్యమైన ప్రాంతాలు, కూడళ్లపై ఆశావహులు, పాత వ్యాపారులు దృష్టి సారించి దరఖాస్తులు సమర్పిస్తున్నారు.

ఇప్పటివరకు ఆఫ్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులు ఇలా....

కర్నూలు జిల్లాలో రూ.55 లక్షల వార్షిక ఫీజు కలిగినవి 8 దుకాణాలు, రూ.65 లక్షల ఫీజు కలిగినవి 91 దుకాణాలున్నాయి. నంద్యాల జిల్లాలో రూ.55 లక్షల వార్షిక ఫీజు కలిగినవి 61 రూ.65 లక్షల వార్షిక ఫీజు కలిగిన 44 దుకాణాలు ఉన్నాయి. ఈ రెండుజిల్లాల్లో మొత్తం 204 దుకాణాలు ఉన్నాయి. అయితే, ఇప్పటివరకు 154 దరఖాస్తులు మాత్రమే ఆయా స్టేషన్లలో ఆఫ్‌లైన్‌లో సమర్పించారు. ఇందులో కర్నూలు జిల్లాలో 99కు గాను 36 దుకాణాలకు 57 దరఖాస్తులు, నంద్యాల జిల్లాలో 105 దుకాణాలకు గాను కేవలం 34 దుకాణాలకు 97 దరఖాస్తులు ఆఫ్‌లైన్‌లో సమర్పించారు. ఉమ్మడి జిల్లాలో ఇంకా 142 షాపులకు ఒక్క దరఖాస్తు కూడా ఆఫ్‌లైన్‌లో సమర్పించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

సింహ వాహనంపై బ్రహ్మచారిణీ దుర్గ



సింహవాహనంపై కొలువైన అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారు శుక్రవారం రాత్రి సింహ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ఆలయ ప్రాకారంలో గ్రామోత్సవం నిర్వహించారు.

కూటమి నాయకులకు భయపడేది లేదు

- నియోజకవర్గంలో రౌడీయిజం చేసేదెవరో ప్రజలకు తెలును
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

దేవనకొండ: కూటమి నాయకుల బెదిరింపులు, కేసులకు భయపడేది లేదని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. శుక్రవారం ఆయన దేవనకొండలోని ఆర్ఆర్ ఫంక్షన్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరులు తాము రౌడీయిజం చేస్తున్నామని ఆరోపిస్తున్నారని, ఈప్రాంతంలో రౌడీయిజం చేసేదెవరో ప్రజలకు తెలుసునని చెప్పారు. విండ్ పవర్ పరిశ్రమ ప్రతినిధి మంజునాథ్‌ను కలిసి పరిశ్రమలో తమ వారికి కూడా ఉపాధి అవకాశం కల్పించాని అడిగామని తెలిపారు. అయితే, కూటమి నాయకులు ఆసంస్థ కార్యాలయంలో విధ్వంసం సృష్టించి తన తమ్ముడు, తన అనుచరులపై కేసులు పెట్టడం దారుణమన్నారు. ఈ ఘటనపై పోలీసు యంత్రాంగం సైతం నిజనిజాలు తెలుసుకోవాలన్నారు. కూటమి నాయకులు అక్రమంగా తన అనుచరులు, పార్టీ శ్రేణులపై కేసులు పెడితే న్యాయంగా ఎదుర్కొంటామన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

అటవీ శాఖ కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్‌గా యశోదాబాయి

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్‌గా ఐఎఫ్ఎస్ ఆర్. యశోదాబాయి నియమితులయ్యారు. ప్రభుత్వం అటవీ శాఖలో ఐఎఫ్ఎస్‌లను భారీగా బదిలీ చేసింది. ఇందులో భాగంగా కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్‌గా ఉన్న పి.రామకృష్ణను ఏపీ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీగా బదిలీ చేస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. మంగళగిరి ఆర్‌అండ్‌డీ సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా ఉన్న ఆర్.యశోదాబాయిని అనంతపురం సర్కిల్‌కు బదిలీ చేస్తూ కర్నూలు సర్కిల్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

కర్నూలులో హైకోర్టే ఏర్పాటు చేయాలి

- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ డిమాండ్
- బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శికి వినతి



బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్‌కు మెమోరాండం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు

కర్నూలు (లీగల్): వెనుకబడిన ప్రాంతమైన కర్నూలు అభివృద్ధి చెందాలంటే హైకోర్టు బెంచ్ కాకుండా హైకోర్టే ఏర్పాటు చేయాలని జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నేతలు డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమరావతిలోని రాష్ట్ర హైకోర్టును కర్నూలుకు రప్పించేందుకు కృషి చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రవికాంత్ ప్రసాద్‌కు వారు మెమోరాండం అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు పి.సువర్ణా రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ ఎం.ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శులు ఎస్.హనుమంతరెడ్డి, ఎస్.షేక్‌షావలి, ఎం.సుబ్బయ్య మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే జిల్లాలో మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త, ఏపీ వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్, ఏపీ విద్యుత్ రెగ్యులేటరీ బోర్డు, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసి కర్నూలు ప్రాంత అభివృద్ధికి నాంది పలికిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాన హైకోర్టును తరలించకుండా అమరావతిలో ఉంచి కర్నూలులో బెంచి ఏర్పాటు చేస్తామనడం సబబు కాదన్నారు. అలాగే ఇప్పటికే ఏర్పాటైన రాష్ట్రస్థాయి సంస్థలను అమరావతికి తరలిస్తే బాబు ప్రభుత్వానికి భవిష్యత్తులో పుట్టగతులుండవని హెచ్చరించారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని కోస్తా ప్రాంతంలో ఉన్నందున హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు న్యాయవాదుల సంఘం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ఇక్కడ రాష్ట్ర హైకోర్టు ఏర్పాటుకు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలన్నారు. అలాగే గత ప్రభుత్వం కర్నూలును న్యాయ రాజధానిగా చేయడాన్ని వ్యతిరేకిస్తూ అప్పట్లో కొందరు హైకోర్టులో వేసిన పిటిషన్లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కర్నూలులో రాష్ట్ర హైకోర్టు ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి ప్రజాక్షేత్రంలోకి వెళ్లనున్నట్లు తెలిపారు.

సున్నిపెంటకు జ్వరమొచ్చింది!

- ఇంటికి ఇద్దరు జ్వర పీడితులు
- డ్రైనేజీల ఆక్రమణతో లోపించిన పారిశుద్ధ్యం
- కుళాయిలకు కలుషిత నీరు సరఫరా
- టైఫాయిడ్, మలేరియా లక్షణాలతో ఆసుపత్రికి



ఆసుపత్రిలో చికిత్సలు తీసుకుంటున్న రోగులు

శ్రీశైలంప్రాజెక్ట్: విపరీతమైన జ్వరం, ఒళ్లంతా నొప్పులు, దగ్గు, జలుబు లక్షణాలతో ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున సున్నిపెంటలో జనం మంచం పడుతున్నారు. పది రోజులుగా జ్వర పీడితులు పెరుగుతున్నా ఇప్పటి వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. సున్నిపెంట ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోజుకు 150 మంది జ్వర లక్షణాలతో చికిత్స కోసం ఓపీకి వస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. పేద రోగులు కొంత మంది ఇన్‌పేషెంట్లుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరి కొందరు ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు. ప్రతి ఇంట్లోని వారంతా జ్వరాలతో మంచం పడుతున్నారు. ప్రైవేటు డాక్టర్లు, ఆసుపత్రులు, మెడికల్ షాపులు బిజీ అయిపోయాయి. ఒక్కో పేషెంట్ నుంచి వందలాది రూపాయలు దండుకుంటున్నారు. సున్నిపెంట గ్రామంలో ప్రజలు జ్వరాల బారిన పడినా జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు

సున్నిపెంటలో జ్వరపీడితులు రక్త పరీక్షలు చేయించుకోగా అధికంగా టైఫాయిడ్ కేసులతో పాటు అక్కడక్కడా మలేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి. గ్రామంలో సుమారు 3,500 మందికి పైగా జ్వరాల బారిన పడినట్లు లెక్కలు చెబుతున్నాయి. గ్రామంలో ఎక్కడ చూసినా పిచ్చిమొక్కలు విపరీతంగా పెరగడం, డ్రైనేజీ కాల్వలపై అక్రమ నిర్మాణాలతో ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోయి దోమలు విపరీతంగా వృద్ధి చెంది స్వైర విహారం చేస్తున్నాయి. డ్యామ్ నుంచి సున్నిపెంట ఫిల్టర్‌హౌస్‌కు చేరే నీటిని క్లోరినేషన్, ఫిల్టరేషన్ సరిగా చేయకుండా నేరుగా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని ప్రజలు తాగడంతో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఫిల్టర్‌హౌస్‌లో తగినంత సిబ్బంది లేకపోవడంతో క్లోరినేషన్‌లో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడి అధికారులు, సిబ్బందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసిన ఉన్నతాధికారులు ఇక్కడికి మాత్రం ఎవరినీ కేటాయించలేదు.

వైద్యులను సంప్రదించాలి



సున్నిపెంట అటవీ ప్రాంతం కావడం, గ్రామంలో పిచ్చిమొక్కలు అధికంగా ఉండటంతో దోమలు పెరిగిపోతున్నాయి. ప్రజలకు సరఫరా అవుతున్న నీరు కూడా పూర్తిగా క్లోరినేషన్ కావడం లేదు. పారిశుద్ధ్యం లోపించి దోమలు వృద్ధి చెందడం, కలుషిత నీరు తాగిన వాళ్లు టైఫాయిడ్, మలేరియా లక్షణాలతో ఆసుపత్రికి వస్తున్నారు. జ్వర పీడితులు ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందాలి.

– డాక్టర్.మహేశ్వరరెడ్డి.సిహెచ్‌సి, సున్నిపెంట

ఫిల్టర్ హౌస్‌లో ఇంజినీర్లే లేరు



సున్నిపెంట ప్రజలకు స్థానిక్ ఫిల్టర్ హౌస్ నుంచి కలుషిత తాగునీరు సరఫరా అవుతుంది. ఇటీవల ఫిల్టర్‌హౌస్ నుంచి ఇంజనీర్లు, సిబ్బందిని బదిలీ చేశారు. ఇక్కడికి ఎవరినీ పోస్టింగ్ వేయలేదు. దీంతో డ్యాం నుంచి పంపింగ్ అవుతున్న నీటిని నేరుగా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఈ నీటిని తాగిన ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు.

– కాశయ్య, ట్రేడ్‌యూనియన్ నాయకుడు, సున్నిపెంట

పరీక్షలు, మందులకు రూ. 1,500 ఖర్చు



నాకు పది రోజుల క్రితం జ్వరం వచ్చింది. మెడికల్ షాపులో జ్వరం మాత్రలు వాడినప్పటికీ తగ్గక పోవడంతో ప్రైవేట్ ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకుంటే టైఫాయిడ్ అని తేలింది. ఐదు రోజుల పాటు ట్రీట్‌మెంట్ తీసుకోవడంతో కొంత జ్వరం తగ్గింది. నీరసం పోలేదు. పరీక్షలు, డాక్టర్ ఫీజులు,మందులకు రూ.1,500 దాకా ఖర్చు అయ్యింది. పారిశుద్ధ్య పనులు చేపడితే దోమల బెడద తగ్గుతుంది.

–జి.ప్రవీణ, జ్వరపీడితురాలు, సున్నిపెంట

రూ.10 నాణేలతో లావాదేవీలు నిర్వహించవచ్చు



సీవీఆర్ ప్రసాద్, చీఫ్ మేనేజర్, ట్రెజరీ బ్రాంచి

కర్నూలు(అగ్రికల్చర్): రూ.10 నాణేలపై ఎలాంటి నిషేధం లేదని, వాటితో లావాదేవీలు నిర్వహించవచ్చని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ట్రెజరీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ తెలిపారు. ఈ విషయంపై వ్యాపార, వాణిజ్య సముదాయాలకు వెళ్లి అవగాహన కల్పించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకుల్లో నగదు డ్రా చేసుకునే వారికి రూ.1000 వరకు రూ. 10 నాణేలు ఇవ్వాలని ఎస్‌బీఐ నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే తాము ఖాతాదారుల నుంచి కూడా వాటిని తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

మన కాలనీ.. మన రోడ్డు!



గ్రావెల్‌ను దోజర్‌తో చదును చేస్తున్న దృశ్యం



కాలనీ ప్రజలు సొంతంగా వేసుకున్న రోడ్డు

- దెబ్బతిన్న జగనన్న కాలనీ రహదారి
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని వైనం
- చందాలు వేసుకుని మరమ్మతులు చేసుకున్న కాలనీ ప్రజలు

పాణ్యం: ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం ఇటీవల 'మన ఇళ్లు .. మన గౌరవం' అనే కార్యక్రమాన్ని నిర్వహించింది. లబ్ధిదారుల సమస్యలను పరిష్కరిస్తూ గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు అధికారులు సదస్సులు చేపట్టారు. కాలనీకి వచ్చిన అధికారులకు సమస్యను వివరిస్తే చూద్దాం.. చేద్దామంటూ దాటవేశారు. అయితే చివరికి చేసేదేమి లేక ఆ కాలనీ ప్రజలు చందాలు వేసుకోని రోడ్డుకు మరమ్మతులు చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గత ప్రభుత్వం పాణ్యం సమీపంలోని మేకలబండపై 625 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చింది. ఇక్కడ హౌసింగ్ ద్వారా 447 మంది గృహాలు నిర్మించుకుంటున్నారు. ప్రస్తుతం 133 గృహాలు పూర్తి కాగా 20 మందికి పైగానే సొంత ఇంట్లో చేరారు. అయితే పాణ్యం చెరువుకట్ట వెంట ఈ కాలనీకి చేరుకోవాలి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు దెబ్బతింది. దీంతో కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు సామగ్రి తరలించేందుకు వాహన డ్రైవర్లు ససేమిరా అంటున్నారు. అంతేకాక కాలనీ ప్రజలు అనేక సార్లు ప్రమాదాలకు గురయ్యారు. ఇటీవల అధికారులు 'మన ఇళ్లు .. మన గౌరవం' అనే కార్యక్రమాన్ని కాలనీకి అతి కష్టం మీద వెళ్లి సమావేశం నిర్వహించారు. కాలనీ ప్రజలు అడిగిన సమస్యల్లో ప్రధానంగా రోడ్డు సమస్య ఉంది. తక్షణమే మరమ్మతులు చేయిస్తామని చెప్పిన అధికారులు అక్కడి నుంచి వెళ్లి ఇంత వరకు పట్టించుకోలేదు. ఇక చేసేదేమీ లేక కాలనీలో ఉన్న ప్రజలు చందాలు వేసుకుని రోడ్డు మరమ్మతులు చేసేందుకు శుక్రవారం నడుంబిగించారు. దాదాపుగా రూ. 20 వేల వరకు ఖర్చు చేసి గ్రావెల్ తోలుకోని గుంతలను పూడ్చి రోడ్డును వేసుకున్నారు. హామీ ఇచ్చిన అధికారులు వస్తే నిలదీస్తామని కాలనీ వాసులు మండిపడుతున్నారు.

డీఆర్‌డీఏ పీడీగా బాధ్యతలు చేపట్టిన నాగశివలీల

కర్నూలు (అగ్రికల్చర్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నాగశివలీల శుక్రవారం సాయంత్రం పదవీ బాధ్యతలు చేపట్టారు. పంచాయతీరాజ్‌లో డీఎల్‌డీఓ అయిన ఈమె మెప్మా పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇంతవరకు డీఆర్‌డీఏ పీడీగా పనిచేసిన సలీం బాషా అనంతపురం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మెప్మా పీడీ నాగశివలీల డీఆర్‌డీఏ పీడీగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు. కాగా ఇటీవలనే ఈ పోస్టులో ప్రతాప్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈయన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ఓఎస్‌డీగా ఐదేళ్లు కొనసాగారు. ఈ విషయాన్ని కొందరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నియామకాన్ని నిలుపుదల చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నాగశివలీలకు డీఆర్‌డీఏ పీడీగా కలెక్టర్ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.